27న రామకుప్పం ఎంపిపి ఎన్నిక

ప్రజాశక్తి - రామకుప్పం: రామకుప్పం మండలం ప్రజాపరిషత్ అధ్యక్షులు, రెండవ వైస్ ఎంపిపి స్థానాలకు ఎన్నికను ఈనెల 27న గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మురళీధర్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాలతో జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు మేరకు రెవెన్యూ డివిజనల్ శ్రీనివాసరాజు అధ్యక్షతన ఎన్నికలు నిర్వహించనున్నారు. కాగా మండలంలో 15 ఎంపీటీసీ స్థానాలు ఉండగా వైసిపి తరుపున ఎంపీపీ గా ఎన్నికైన శాంతకుమారి 2021 వ సంవత్సరంలో అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటినుండి ఈ స్థానం ఖాళీగా ఉండగా ఒకటవ వైస్ ఎంపిపి సుబ్రమణ్యం ఇన్చార్జి ఎంపిపిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికీ 5 సార్లు ఎన్నికలు చేపట్టినా ఎంపీటీసీలు హాజరు కాకపోవడంతో ఎంపిపి ఎన్నిక వాయిదాలు పడుతూవస్తోంది. అయితే ఇటీవల మండలంలోని 7 మంది ఎంపీటీసీలు టీడిపిలో చేరడంతో ఈసారి రామకుప్పం ఎంపిపి స్థానంను ఎవరు దక్కించుకుంటారని జోరుగా చర్చ జరుగుతోంది.

అభివృద్ధికి ఆమడ దూరంలో శ్రీహరిపురం ఎస్టీ కాలనీ

నేటికీ పూరి గుడిసెల్లోనే..

- రాళ్లు తేలిన మట్టి రోడ్డు
- రాకపోకలకు ఇక్కట్లు
- కట్టెల పొయ్యితోనే జీవనం
- కలుషితమైన ఊటనీరే ఆధారం

దేశంలో మారుమూలపల్లెల్లో నివసించే గిరిజనులకు మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతూనే ఉన్నాయి ఫలితంగా వారి అభివృద్ధి కుంటుపడుతోంది. అధికారిక గణాంకాల ప్రకారం ఇప్పటికీ గిరిజన గ్రామాలకు సరైన రహదారుల సౌకర్యం లేదు, వాన కురిస్తే ఊరు దాటలేని పరిస్థితి, కొన్ని గ్రామాలకు మాత్రమే బస్సు సౌకర్యం కలిగి ఉన్నాయి. ఇప్పటికీ 11.5 శాతం ఆదివాసి గ్రామాల్లో పాఠశాలలు లేవు. అంతేకాదు గిరిజన గ్రామాల్లో తాగు నీరు కూడా పెద్ద సమస్యే. ఇప్పటికీ శుద్ధి చేసిన నీరు అందుబాటులో లేక ఇబ్బంది పడుతూనే ఉన్నారు.

ప్రజాశక్తి- విజయపురం: మండలంలోని శ్రీహరిపురం ఎస్టీ కాలనీ అభివృద్ధికి ఆమాడ దూరంలో ఉంది. కనీసం రోడ్డు సదుపాయం, కనీస వసతులు లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ఇప్పటికీ గుడిసెల్లో జీవిస్తూ, కట్టెల పొయ్యిపైనే వంట చేసుకుంటున్నారు. రక్షిత తాగునీటి సదుపాయం లేదు. ఈ కాలనీలో సుమారు 20 గిరిజనుల కుటుంబాలు ఉంటున్నాయి. మండల కేంద్రానికి 15 కిలోమీటర్లు దూరంలో ఉన్న ఈ గ్రామాలకు కనీస రహదారి సదుపాయం లేదు. ఉన్న రోడ్డు వర్షాకాలంలో బురదమయంగా మారి నడిచి వెళ్లడానికి కూడా వీలులేని విధంగా ఉంటుంది దీంతో నిత్యావసర సరకులు తెచ్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పురుటి నొప్పులు వచ్చిన గర్భిణులను, తీవ్రఅస్వస్థతకు గురైన వారిని ఆస్పత్రికి తరలించాలంటే అష్టకష్టాలు తప్పడంలేదు.

పాలకులు మారినా.. మారని బతుకులు

ఐదేళ్లకు ఒకసారి పాలకులు మారిన వీరి జీవతం మారలేదు. నేటికి పక్కా ఇళ్లు లేక పూరిగుడిసెలోనే ఉంటున్నారు. కూర్చొని పైకి లేస్తే తలకు గాయాలు అవుతాయి. అంత చిన్న గడిసెల్లో జీవనం సాగిస్తున్నారు. దీపం కనెక్షన్ కింద గ్యాస్ పొయ్యి కూడా లేక కట్టెల పొయ్యిపైనే అన్నం వండుకొని తింటున్నారు. కనీసం ఉపాధి పనులు కూడా కల్పించడం లేదు. పనులు కల్పించి జీవనోపాధులు కల్పించాలని పలుమార్లు అర్జీలు ఇచ్చినా పట్టించుకొనే అధికారులు కరువైయ్యారు.

రాళ్లు తేలిన దారి

పాఠశాలకు వెళ్లని పిల్లలు..

గిరిజన కాలనీ పిల్లలు బడికి వెళ్లాలంటే సుమారు కిలో మీటరుపైనే నడిచి వెళ్లాలి. సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపడం లేదు. దీంతో చదువుకోవల్సిన పిల్లలు అడవి చెట్ల మధ్య ఆటలాడుకొంటున్నారు. ఇప్పటికైన అధికారులు చర్యలు చేపట్టి, ఎస్టీ కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని కోరుతున్నారు.

ఉండటానికి ఇల్లు కావాలి సార్..

- శ్రీహరిపురం గ్రామవాసి

మేము శ్రీహరిపురం ఎస్టీ కాలనీలో ఉంటున్నాం. కనీసం ఇల్లు లేకుండా లేదు. చిన్నపాటి పూరి గుడిసెలో ఎండకు, వానకు ఇబ్బంది పడుతున్నాం. నాకు నలుగురు పిల్లలు. ఈ చిన్న గుడిసెలోనే నివాసం ఉంటున్నాం. ఈ గుడిసిలో నిలబడితే గుడిసె తలకు తగులుతుంది. పడుకొని కాలు చాపితే గోడ తగులుతుంది. ఇలా చాలా కాలంగా అవస్థలు పడుతూనే ఉన్నాం. ఇప్పటికైనా అధికారులు పాలకులు తమపై దృష్టి ఉంచి మాకు ఇల్లు మంజూరు చేయండి..

మహిళా భద్రతకు శక్తి టీమ్స్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

మహిళలు, బాలికల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం మహిళా దినోత్సవం రోజున మహిళల భద్రత కోసం యాప్ సేవలతోపాటు శక్తి టీమ్‌లను ఏర్పాటు చేసింది. మహిళా భద్రత పేరుతో ప్రత్యేక మహిళా పోలీసులను ఏర్పాటు చేసి శక్తి యాప్‌ను రూపొందించింది. సాయం అవసరమైన మహిళలకు క్షణాల్లో స్పందించి సేవలంచే లక్ష్యంతో ఈ శక్తి టీములు పని చేయనున్నాయి.

చిత్తూరులో శక్తి టీంలను ప్రారంభిస్తున్న అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజు (ఫైల్ ఫొటో)

చిత్తూరు జిల్లాలో కూడా ఆరు శక్తి బృందాలు ఏర్పాటు చేశారు. ఒక్కో బృందలో ఎస్ఐ, ఏఎస్ఐ నేతృత్వంలో ఏడుగురు సభ్యులుంటారు. చిత్తూరులో శక్తి బృందాలు చిత్తూరు సబ్‌డివిజన్‌లో 3, నగరి 1, కుప్పం 1, పలమనేరు 1 మొత్తంగా చిత్తూరు జిల్లాలో ఆరు శక్తి బృందాలు ఈనెల 8వ తేదీ మహిళా దినోత్సవం నుండీ అందుబాటులోకి తీసుకొచ్చారు. మహిళాలపై వేధింపులు అరికట్టేందుకు శక్తిటీమ్స్ పని చేయనున్నాయి. మహిళలపై జరుగుతున్న దాడులు, ఆకతాయిల వేధింపులు నియంత్రించి మహిళలకు రక్షణగా నిలిచే చట్టాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శక్తి యాప్‌పట్ల అవగాహన కల్పించేలా శక్తి టీమ్స్ పనిచేస్తున్నాయి. పోలీసు శాఖ ఏర్పాటు చేసిన శక్తి టీమ్స్ కళాశాలలు, పార్కులు, ఆర్టీసీ బస్టాండ్లు, నగరంలోని ముఖ్య కూడళ్ళులో మఫ్టీలో నిఘా ఉంచుతుంది. మహిళలు, బాలికలను వేధించే ఆకతాయిలను గుర్తించి వారిని అదుపులోకి తీసుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. ఆపద సమయాల్లో శక్తి యాప్‌కు వచ్చే ఎస్ఓఎస్ కాల్స్, డయిల్ 112, 100 కాల్స్‌తో సంఘటన స్థలంకు ఈ టీమ్ చేరుకొని సమస్యలను చట్టపరంగా పరిష్కరించాల్సి ఉంటుంది.

సాంకేతిక సాయంతో..

శక్తి బృందాల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించింది. మహిళలు, యువతులు కచ్చితంగా ఈ తమ మొబైల్ ఫోన్‌లో ఈ శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొనేలా బృందాలు జిల్లా పరిధిలో పట్టణాలు, నగరాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. రాత్రిపూట మహిళలు ఎక్కడైనా చిక్కుకున్నా.. ఆకతాయిలే వేధిస్తున్నా.. పిల్లలు తప్పిపోయినా ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని పోలీసులు తెలియజేస్తున్నారు.

ఎలా వినియోగించాలంటే...

శక్తి యాప్ మొబైల్‌ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవాలి. మొబైల్ నెంబర్ యాడ్‌సి ఓటిపితో సైన్‌ఇన్ కావాలి, అపై వచ్చే ఆప్షన్‌లో పేరు, చిరునామా ఫోన్ నెంబర్ లోకేషన్ లాంటి వివరాలు నమోదు చేయాల్సి ఉటుంది. కుటుంబ సభ్యులు, బంధువులకు సంబంధించి అందుబాటులో ఉండే రెండు ఫోన్ నెంబర్లు, లోకేషన్ వివరాలు నమోదు చేయాలి. అనతరం యాప్‌లో వచ్చే ఎస్ఎంఎస్ అనే అప్షన్‌పై క్లిక్ చేస్తే మొబైల్‌లోని కెమెరా ఆటోమెటిక్‌గా తెరుకొని 10సెంక్ల వీడియో రికార్డు అవుతుంది. ఇది క్షణాల్లో పోలీసు కంట్రోల్ రూమ్‌కు వెళ్తుంది. దీంతో స్థానికంగా ఉన్న పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి రక్షిస్తారు. పిల్లలు తప్పిపోతే మిస్సింగ్ చైల్డ్ రిపోర్టింగ్ అప్షన్ ద్వారా ఫిర్యాదు చేసే సౌకర్యం అందుబాటులో ఉంది. యాప్‌లో సేఫ్ జర్నీ, గిబ్ కంప్లైంట్, మిస్సింగ్ చైల్డ్ రిపోర్ట్స్, నైట్ షెల్టర్స్, ఫ్యామిలీ కౌన్సిలింగ్, ఎమర్జెన్సీ కాంట్రాక్ట్స్ వంటి అప్షన్లు ఉన్నాయి.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని పిడివి కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ విక్రమ్ వారి తండ్రి, చెల్లెలు జ్ఞాపకార్థం విద్యార్థులకు క్రీడా పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు విద్యలో ఉన్నతమైన చదువులు కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తిగా తీసుకోవాలని, క్రీడల్లో రాణిస్తున్న ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. వేసవి సెలవుల సమయాన్ని వృథా చేయకుండా విద్య, క్రీడల పట్ల ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ జయచంద్ర నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు జయప్రకాశ్ నాయుడు, సర్పంచ్ షిబా స్వామిదాస్, ఎంపీటీసీ విజయ్ కుమారి, ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ఆఫీసులో ప్రజాదర్బార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: లక్ష్మీ నగర్ కాలనీలోని చిత్తూరు ఎమ్మెల్యే వారి కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్‌లో భాగంగా ప్రజాఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 26వ తేదీ బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నియోజకవర్గ ప్రజల సమస్యలపై వినతులు స్వీకరించనున్నారు. మధ్యాహ్నం 'కార్యకర్తే అధినేత' కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారు.

వేడుకగా మెట్లోత్సవం

ప్రజాశక్తి - తిరుమల టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల 522వ వర్ధంతి మహోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం అలిపిరి పాదాలమండపం మెట్లోత్సవం వైభవంగా జరిగింది. మెట్లోత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ప్రాజెక్టు సంచాలకులు రాజగోపాలరావు అన్నారు. భజనమండళ్ల గోవింద నామస్మరణతో నడకమార్గం మార్మోగింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దాదాపు 700 మందికిపైగా భజనమండళ్ల సభ్యులు భజనలు చేసుకుంటూ తిరుమలకు చేరుకున్నారు.

కార్మికులపై కక్షసాధింపు

స్విమ్స్ నర్సింగ్ సూపరింటెండెంట్ బదిలీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: కార్మికులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడిన స్విమ్స్ నర్సింగ్ సూపరింటెండెంట్ ప్రభావతిని ఎట్టకేలకు బదిలీ చేశారు. దాదాపు 60 మంది కార్మికులను తొలగించిన ఆమెపై స్విమ్స్ డైరెక్టర్ రవికుమార్ విచారణ చేపట్టారు. కార్మిక నాయకులు రవి, ముత్తు, సూరిలు ఆమె చేసిన ఆగడాలపై కూలంకుషంగా డైరెక్టర్‌కు విన్నవించారు. ఆమెపై చర్యలు తీసుకోకపోవడంతో ఈ పంచాయతీ టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు వరకు వెళ్లింది. ఐదేళ్లు వైఎస్ఆర్ కాంగ్రెస్ హయాంలో చక్రం తిప్పుతూ కూటమి ప్రభుత్వంలోనూ స్విమ్స్‌లో ఆమె తిరుగులేకుండా వ్యవహరించడంతో వేధింపులకు బలైన కార్మికులు ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. టిటిడి ఛైర్మన్ స్పందించి వెంటనే ఆమెను బదిలీ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. పద్మావతి హాస్టల్లో డిప్యూటీ డైరెక్టర్‌గా ఆమె బదిలీ అయ్యారు. హాస్టల్‌కు మాత్రమే ఆమెను పరిమితం చేయడంపై కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టీటీడీకి రూ.10.11 లక్షలు విరాళం

ప్రజాశక్తి - తిరుమల: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ నగరానికి చెందిన గౌరవ్ ఐరెన్ అనే భక్తుడు మంగళవారం శ్రీవేంకటేశ్వర సర్వ శ్రేయస్ ట్రస్టుకు రూ.10,11,111 విరాళంగా అందించారు. ఈ డిడిని ఛైర్మన్ బిఆర్ నాయుడుకు అందజేశారు.

చెక్ డ్యామ్‌లన్నీ మరమ్మతు చేసుకోవాలి

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): వేసవిలోపే రాష్ట్రంలోని అన్ని చెక్ డ్యామ్‌లను రిపేర్లు పూర్తి చేసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ల సదస్సులో భాగంగా నరేగా పథకంపై అధికారులు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పైన ఆయన మాట్లాడుతూ వేసవి పూర్తిఅయ్యేలోపు చెక్ డ్యామ్‌లన్నీ కూడా రిపేర్లు పూర్తి చేయాలని, నరేగా నిధులు సక్రమంగా వినియోగంచుకుని పనులు చేయాలన్నారు. అటవీశాఖ కూడా నరేగా పథకం వినియోగించుకుని పచ్చదనం పెంపుదలకు కృషి చేయాలని కోరారు. నరేగా పథకం బాగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాల్లో కలెక్టర్లు ఈ పథకం అమలుపైన దృష్టి సారించి ప్రజలకు సాధ్యమైనంత ఎక్కువ పనిరోజులు కల్పించాలని సూచించారు. పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ మాట్లాడుతూ నరేగా పథకం సమర్థవంతంగా వినియోగించుకోవడానికి ఈ వేసవి కాలం చాలా కీలకమైందన్నారు. గ్రామాల్లో ప్రజలు పనుల కోసం వలసలు వెళ్లకుండా నిరోధించేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో సాధ్యమైనంత ఎక్కువ పని రోజులు ప్రజలకు ఈ పథకంలో కల్పించి వారు ఇతర ప్రాంతాలకు వసలపోకుండా నిరోధించాలన్నారు. నరేగాకు నిధుల కొరత లేదని, ఆయా గ్రామాల్లో తగినన్ని పనులు గుర్తించేలా స్థానిక యంత్రాంగాన్ని సమాయత్తం చేయాలన్నారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది నరేగాలో పనులు పురోగతి సాధించిందని వివరించారు. అన్ని పంచాయతీల్లో పనులు ఆరంభించారని, ఎక్కడైనా ఇంకా పనులు ప్రారంభని పంచాయతీలుంటే గుర్తించి అక్కడ కూడా నరేగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో నరేగా ద్వారా 4 వేల కిలోమీటర్ల రహదార్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 1.55 లక్షల పంట కుంటలు తవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. అలాగే 20లక్షల హౌస్ హోల్డ్ కంపోస్ట్ పిట్స్ ఏర్పాటు చేయబోతున్నట్లు వివరించారు. పల్లె పుష్కరణి కార్యక్రమం కింద 1000 చెరువులను అభివృద్ధి చేయబోతున్నట్లు చెప్పారు. అటవీ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు నరేగా కింద పనులు కల్పించలేమనే అపోహ కొంతమంది అధికారుల్లో ఉన్నట్లు తమకు తెలిసిందని, అటవీ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు కూడా నరేగా కింద పనులు కల్పించవచ్చని, కలెక్టర్లు దీనిపైన దృష్టి పెట్టాలని కోరారు.

కలెక్టర్ల సదస్సులో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

కలెక్టర్ల సదస్సులో జిల్లా కలెక్టర్

చిత్తూరు అర్బన్: అమరావతి రాష్ట్ర సచివాలయంలో రెండు రోజుల పాటు జరగనున్న 3వ జిల్లా కలెక్టర్ల సమావేశం మొదటిరోజు మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ప్రారంభమైంది. మూడవ జిల్లా కలెక్టర్ల సమావేశంలో రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, డిజిపి హరీశ్ కుమార్ గుప్తా, వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు పాల్గొన్నారు. అలాగే కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పాల్గొన్నారు.

ధర లేక... వేరే దారి లేక...

'ఆశ' చావక వీధివీధి తిరిగి అమ్ముకుంటున్న పుచ్చ రైతులు

- రోడ్లల్లో అమ్ముకుంటున్న అన్నదాత
- రూ.7వేలకు పడిపోయిన టన్ను ధర

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

రైతన్న ఆరుగాలం శ్రమ అప్పుల పాలవుతోంది..'అమ్ముదాం అంటే అడవి.. కొందాం అంటే కొరివి" అన్న చందంగా మారింది. వాతావరణ పరిస్థితులు..ప్రకతి విపత్తులను దాటి పంటలను సాగు చేస్తున్న రైతన్నలను స్థిరత్వం లేని మద్దతు ధరలు వెక్కిరిస్తున్నాయి. సాంప్రదాయ పంటల సాగులో వస్తున్న నష్టాలను వాణిజ్య పంటల్లోనైనా పూడ్చుకుందామనుకుంటున్న రైతన్న ఆశలు అడియాశలే అవుతున్నాయి. తూర్పున పుచ్చ పంటను సాగు చేస్తున్న రైతులకు మద్దతు ధర లేకపోవడంతో తూర్పున సూరీడు ఉదయించకముందే తానే వ్యాపారిగా మారి పల్లె లు, పట్టణాలు తిరిగి కాయలు అమ్ముకునే దుస్థితి నెలకొంది. వ్యాపారులు సిండి'కేటు'గా మారి మద్దతు ధరలు భారీగా తగ్గించేయడంతో రైతుకు దయనీయమైన పరిస్థితులు నెలకొనడం విచారకరం.

టన్ను రూ.7 వేలకు...

' సాంప్రదాయ పంటలు వద్దు.. వాణిజ్య పంటలే ముద్దు' అంటూ వ్యవసాయాధికారులు ఊదరగొడుతున్న మాట. అందుకుతగ్గట్లుగానే రైతులు సాంప్రదాయ పంటలు మాని వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలోనే తూర్పు మండలాల్లోని రైతులు పుచ్చ సాగుపై అమితాసక్తి కనబరిచారు. గత పదేళ్లుగా పుచ్చ సాగు చేసి తీపి ఫలితాలు చూసిన రైతులు ఈ సారి ఏకంగా రెండు వేల ఎకరాల్లో పుచ్చ సాగుకు ఉపక్రమించారు. అయితే ఇదే రైతులకు శాపంగా మారింది. దళారులు, వ్యాపారులు సిండి'కేటు' గా మారి ధరలు అమాంతం తగ్గించేశారు. ప్రస్తుతం రైతు వద్ద టన్ను పుచ్చకాయలను కేవలం రూ. 7 వేలకే కొంటున్నారు. మార్కెట్ లో కేజీ ధర రూ. 25గా ఉంటోంది. గతేడాది టన్ను ధర రూ. 18 వేల నుంచి రూ. 15 వేలు పలికింది. ఈ ఏడాది మద్దతు ధర అధ:పాతాళానికి పడిపోవడంతో రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో విధిలేని పరిస్థితుల్లో రైతులు దళారులు నిర్ణయించిన ధరకు కాయలను అమ్ముకుంటుండగా , మరి కొందరు తామే కాయలను పట్టణాలు, పల్లెలకు తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు. ఎకరా పొలంలో పుచ్చ సాగుకు పెట్టుబడి రూ.లక్ష దాకా అవుతోంది. అయితే ప్రస్తుతం ఉన్న మద్దతు ధర రీత్యా రైతుకు పెట్టుబడి ఖర్చు కూడా వచ్చే పరిస్థితి లేదు. వాణిజ్య పంటలు సాగు చేయాలని రైతులను సమాయత్తం చేస్తున్న పాలకులు, అధికారులు వాటికి మద్దతు ధరలు నిర్ణయించడంలో విఫలమవుతున్న పరిస్థితి. ఫలితంగా రైతులకీ దుస్థితి నెలకొంటోంది. ఇకనైనా పాలకుల్లో చలనం వచ్చి ధరల స్థిరీకరణ, పంటలకు మద్దతు ధరపై దష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పెట్టుబడి కూడా రాదు: వెంకటముని నాయుడు, రైతు, బోనుపల్లి

రెండు ఎకరాల్లో పుచ్చ సాగుకు రూ. 2 లక్షలు పెట్టుబడి ఖర్చు అయింది. దిగుబడి కేవలం 20 టన్నులు మాత్రమే వచ్చింది. వ్యాపారులు టన్ను కాయలను రూ.7 వేలకే కొంటున్నారు. దీంతో తామే పల్లెలు, పట్టణాలకు పోయి బాడుగ ట్రాక్టర్లు ఆటోలలో కాయలు అమ్ముకుంటున్నాం.

2024-25 బడ్జెట్ అంచనాలకు

స్టాండింగ్ కమిటీ ఆమోదం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం మంగళవారం నగర మేయర్ ఎస్.అముద అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, స్టాండింగ్ కమిటీ సభ్యులు, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, కె.నిర్మల, ఆర్.శశి కుమార్, ఎస్.సుష్మ, కె.అశోక్ హాజరయ్యారు. స్టాండింగ్ కమిటీలో భాగంగా అజెండా అంశాలపై చర్చించి ఆమోదించారు. ప్రధానంగా 2024-25 సంవత్సరపు సవరించిన బడ్జెట్ అంచనాలను, 2025-26 సంవత్సర బడ్జెట్ అంచనాలను ఆమోదిస్తూ కౌన్సిల్ వారి సర్వసభ్య సమావేశానికి పంపడానికి అనుమతించారు. నగరపాలక సంస్థ పరిధిలో ఫారెస్ట్ రోడ్డులో వేలూరు రోడ్డు బీసీ భవన్ నుండి మ్యాంగో భవన్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూపొందించిన అంచనాలను సాధారణ నిధుల నుంచి వ్యయం చేయడానికి స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు, ఇతర అంశాలపై స్టాండింగ్ కమిటీ చర్చించి ఆమోదముద్ర వేశారు. సమావేశంలో సహాయ కమిషనర్ ఎ ప్రసాద్, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

ఆస్తిపన్నులో 50 శాతం వడ్డీ రాయితీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

నగరపాలక పరిధిలో భవనాలు, ఖాళీ స్థలాలకు సంబంధించి 2024-25 సంవత్సరానికి గాను పన్నులను ఈనెల 31వ తేదీ లోగా చెల్లించిన వారికి 50 శాతం వడ్డీ రాయితీ ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నగరపాలక పరిధిలోని భవనాలు, వ్యాపార సముదాయాలు, ఖాళీ స్థలాల యజమానులు పన్నులు చెల్లించి నగరపాలక అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఇదివరకే అనగా.. 2024 ఏప్రిల్ 1వ తేదీ తర్వాత వడ్డీతో సహా పన్నులు చెల్లించిన వారికి 50 శాతం వడ్డీ రాయితీని అందిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, ఈ 50 శాతం వడ్డీ రాయితీ సొమ్ములను రాబోయే సంవత్సరానికి జమ చేయడం జరుగుతుందన్నారు. భవన యజమానులందరూ సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈనెల 31 గడువు తేదీలోగా పన్నులు చెల్లించి 50శాతం వడ్డీ రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పన్ను చెల్లింపుదారుల కోసం నగరపాలక కార్యాలయంలో ఏడు కౌంటర్లను ఏర్పాటు చేశామని, కౌంటర్లన్నీ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు పనిచేస్తాయన్నారు. పన్నులను స్థానికంగా వార్డు సచివాలయాల్లోనూ చెల్లించవచ్చని తెలిపారు.

దళితునిపై చిన్న చూపు

దౌర్జన్యంగా సర్వీస్ వైర్ కట్ చేసిన అధికారులు

ప్రజాశక్తి- విజయపురం

దళితుడనే చిన్న చూపుతో తమ కరెంటు సర్వీసు కట్ చేశారని మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్ సిబ్బందిపై మంగళవారం వైసీపీ నాయకుడు జిల్లుదాసు ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి ఒక్కరికీ నాణ్యమైన తాగునీరు అందించాలని మూడు సంవత్సరాల క్రితం వాటర్ ప్లాంట్ మంజూరు చేసిందని, కరెంటు సర్వీసు కూడా మంజూరు చేశారని, ప్రతి నెలా క్రమం తప్పకుండా బిల్లులు చెల్లిస్తున్నామని తెలిపారు. అయితే ఇప్పుడు అక్రమ సర్వీసు అంటూ సర్వీస్ వైర్ కట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారని తనకు న్యాయం చేయాలని కోరారు.

31 లోపు ఆస్తి పన్ను చెల్లించాలి: కమిషనర్

ప్రజాశక్తి- పలమనేరు: 50 శాతం అపరాధ రుసుముతో ఈ నెల 31వ తేదీ లోపు పలమనేరు మున్సిపాల్టీ పరిధిలో ఆస్తిపన్ను బకాయి ఉన్న యజమానులు చెల్లించవచ్చని కమిషనర్ ఎన్‌వి రమణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆస్తిపన్ను బకాయి వున్న వారు సమీపంలోని సచివాలయాల్లో, మున్సిపల్ కార్యాలయంలో కాని వెంటనే చెల్లించి అపరాధ రుసుములో రాయితీ పొందాలని సూచించారు. అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్, సెక్రటరీ సిక్రెటరీ మార్కెట్ కమిటీ బకాయి ఆస్తిపన్ను 7లక్షల86వేల32 రూపాయలు చెక్కును మంగళవారం అందించాని తెలిపారు.

కుప్పం టౌన్ : కుప్పం పట్టణంలోని ప్రజలు తమ ఆస్తులకు సంబంధించి పురపాలక సంఘానికి చెల్లించాల్సిన పన్నులు సకాలంలో చెల్లించాలని కమిషనర్ శ్రీనివాస రావు కోరారు. పట్టణ పరిధిలోని ఆస్తి, ఖాళీ స్థల యజమానులు పురపాలక సంఘానికి పన్నులు బకాయి పడ్డట్టు తెలిపారు. ఈ బకాయిలను నెలాఖరు లోపున చెల్లించాలని ఆయన సూచించారు. అపరాధ రుసుముతో చెల్లించవలసిన బకాయి దారులకు 50 శాతం అపరాధ రుసుము తగ్గించడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. బకాయి దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పురపాలక సంఘానికి బకాయి పడ్డ పన్నులను చెల్లించాలని కోరారు.

కుప్పం కమిషనర్ శ్రీనివాసరావు

టిడిపి సీనియర్ నాయకుడు గంగాధరానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గంగాధరానికి పలువురి నివాళి

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని తీర్థం పంచాయతీ టిడిపి సీనియర్ నాయకుడు ఏ గంగాధరం సోమవారం మృతి చెందాడు. ఆయన భౌతికాయానికి మండల టిడిపి అధ్యక్షులు బి ఎం కిషోర్, మండల ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం శెట్టి, స్థానిక మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, పంచాయతీ కన్వీనర్ గోవిందస్వామి, రమేష్, కృష్ణప్ప, కృష్ణయ్య శెట్టి మంగళవారం గంగాధరం మృతదేహానికి పూలమాల వేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఆయనకు నివాళులు అర్పించారు.

నేడే ప్రజా సమస్యల పరిష్కార వేదిక: ఎంపిడివో

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : గంగాధర్ నెల్లూరు నియోజకవర్గం లోని మండల కేంద్రమైన ఎస్ఆర్ పురం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో బుధవారం రాష్ట్ర విప్ గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వి ఎం థామస్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తారని ఎంపీడీవో మోహన మురళి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ప్రజలు తమ సమస్యలు తెలిపేందుకు ప్రజా సమస్యల దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫోన్ నెంబర్ ని జత చేయాలన్నారు. ఈ అవకాశాన్ని ఎస్ఆర్ పురం మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యూనిఫామ్‌లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్

యూనిఫాం పంపిణీ

ప్రజాశక్తి -యాదమరి: యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు యూనిఫామ్‌ను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ లు మంగళవారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆశా కార్యకర్తలు వైద్య పరంగా అందిస్తున్న సేవలను గుర్తించిన ప్రభుత్వం వారికి ప్రతి ఏటా ఒక్కొక్కరికిరెండు జతలు యూనిఫామ్ దుస్తులను ఉచితంగా అందిస్తోందన్నారు. మాతా శిశు సంక్షేమం వైద్య పరంగా ప్రజలకు అందే సేవలలో ఆశా కార్యకర్తలు కీలక భూమిక పాటిస్తున్నారని వారిని మరింత ఉత్తేజపరిచేందుకే ప్రభుత్వం ఉచితంగా ప్రతి ఏటా యూనిఫామ్ దుస్తులను అందిస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మరింత సేవలు అందించాల్సిన బాధ్యత ఆశా కార్యకర్తలపై ఉందని వేసవికాలం ప్రారంభమైన దృష్ట్యా రైతులు, పశువులు కాపరులు గొర్రెల కాపరులకు వడదెబ్బపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఎండకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు . ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సిహెచ్ లక్ష్మీనారాయణ, సూపర్వైజర్లు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -పలమనేరు: ప్రస్తుతం సమాజంలో రక్తం కొరతను దృష్టిలో ఉంచుకొని శ్రీ వర్ర చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్‌సిసి, ఎస్ఎస్ఎస్, ఓఆర్ఆర్‌సి అండ్ వైఆర్ఇ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఇందులో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, ఇతరులు నుంచి 46 యూనిట్లు రక్తాన్ని సేకరించి చిత్తూరు ప్రభుత్వ వైద్యశాల రక్త నిధికి అందించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు వెంకటేసులు, షణ్ముగం తెలిపారు.

ముందుచూపు కరువు

- సెలవులో డిజిటల్ అసిస్టెంట్
- సచివాలయంలో స్పందించని అధికారులు
- ఆధార్ అప్‌డేట్‌కు అవస్థలు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని ఓ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంటు సెలవులో వున్నాడు. ఈ విషయం తెలియక స్థానిక ప్రజలు ఆధార్ అప్‌డేట్ కోసం సచివాలయానికి వచ్చి గంటలు తరబడి నిరీక్షించి నిరాశతో వెనుతిరిగి వెళుతున్నారు. ఆ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ ఉండడు.. ఈ విషయం తెలియక స్థానికులు అక్కడికి వచ్చి వెనుతిరుగుతున్నారు. అధికారులకు ముందు చూపు లేదు... అక్కడ డిజిటల్ అసిస్టెంట్ లేడని..లీవ్‌లో ఉన్నాడని వారికి తెలుసు.. వేరే వాళ్లను నియమించరు.. ఈ విషయం తెలియక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సొంత గ్రామాల నుంచి ఈ ఎండలకు అక్కడికి చేరుకొని నిరాశంతో తిరిగి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో ఆ సచివాలయం పరిధిలో ఆధార్ అప్‌డేట్ ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలోని వెదురుకుప్పం మండలం, మాంబేడు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ అఖిల్ విధులు నిర్వహిస్తుండేవాడు. అఖిల్ ఇంటి వద్ద ఈ నెల మొదటి వారంలో ప్రమాదవశాత్తు కింద పడడంతో గాయాల పాలయ్యాడు. అప్పటి నుంచి లీవ్‌లో ఉన్నాడు. డిజిటల్ అసిస్టెంట్ లేక ఆ సచివాలయంలో స్థానికులకు, ప్రజలకు, రైతులకు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ నెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆధార్ స్పెషల్ క్యాంపు చిన్న పిల్లల ఆధార్ బయోమెట్రిక్, ఈ కేవైసీ ఇతర సేవలను ఉచితంగా సచివాలయం నుంచి అందించాలని నిర్ణయించి అందిస్తోంది. ఈ సచివాలయంలో పరిధిలో ఉన్న చాలా మంది సమస్యలతో ఆ సచివాలయానికి వచ్చి తెలియక తిరుగు ముఖం పడుతున్నారు. కొంత మంది పక్కనే ఉన్న పచ్చికాపల్లం సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ సేవల కోసం వెళుతున్నారు. స్పందించి ఈ సచివాలయంలో వెంటనే డిజిటల్ అసిస్టెంట్‌ను ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి స్థానికులకు ఆధార్ అప్‌డేట్ సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

డిజిటల్ అసిస్టెంట్ లీవు వాస్తవమే..

మాంబేడు సచివా లయంలో విధులు నిర్వహిస్తున్న అఖిల్ సెలవు ల్లో ఉన్న మాట వాస్తవమే. ఇతని స్థానంలో సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఉన్న సుబ్రహ్మణ్యంకి బాధ్యతలు అప్పగించాం. స్థానికులకు ఇబ్బం ది లేకుండా చర్యలు తీసుకుంటాం..
- అమరనాథ్, వెదురు కుప్పం ఎంపీడీవో.

సమావేశంలో మాట్లాడుతున్న చిత్తూరు టిడిపి నాయకులు

హామీల అమలుపై హర్షం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమ లు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టడం హర్షణీయమని అమలు చేస్తున్న చంద్రబాబు నాయుడు అని చిత్తూరు జిల్లా టిడిపి నాయకులు కొనియాడారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఇచ్చి మాట ప్రకారం ఏప్రిల్ మొదటి వారం డిఎస్‌సి, మేలో తల్లికి వందనం అమలు చేస్తున్నారన్నారు. గతంలో జగన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలేవీ సరిగ్గా అమలు చేయలేదని అమ్మవడి రూ.15 వేలు చెప్పి రూ.12 వేలు ఇచ్చి మోసం చేశారన్నారు. డిఎస్‌సి ఊసే లేదన్నారు. ప్రస్తుతం శాసనసభకు రాకుండా ప్రభుత్వంపై జగన్ విమర్శలు చేస్తూ అవహేళన చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో టిడిపి కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్ , ఐరాల మండల మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివకుమార్, తెలుగు యువత పూతలపట్టు నియోజకవర్గం కార్యదర్శి వినోద్ కుమార్, మండల కోశాధికారి జ్యోతినాథ్ పాల్గొన్నారు.

విజయపురం ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న కె రంగా

ప్రజాశక్తి- విజయపురం: విజయపురం మండల ఎస్ఐగా కె రంగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్ర తల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమా లు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. రాబోయే రోజుల్లో శాంతి యుతంగా నిర్వహించుకోవాలని, మండల ప్రజలకు సూచించారు. ఎస్ఐకి పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బృందావన్ స్కూలు వార్షికోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

ఘనంగా 'బృందావన్' స్కూలు వార్షికోత్సవం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: బృందావన్ ఇంగ్లీష్ మీడియం స్కూలు 12వ వార్షికోత్సవ సంబరాలు మంగళవారం స్థానిక బృందావన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బృందావన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థినివిద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల కరస్పాండెంట్ శైలజ కుమారి, డైరెక్టర్ ప్రియాతేజ మాట్లాడుతూ బృందావన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఉన్నత విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆహ్లాదకరమైన వాతావరణం విశాలమైన, క్రీడా మైదానం, డిజిటల్ తరగతి గదుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు.

సిసి కెమెరాలను ప్రారంభిస్తున్న దృశ్యం

సిసి కేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి- కుప్పం రూరల్ :

కుప్పం పట్టణ పరిధిలో దేశ, రాజకీయ నాయకుల విగ్రహాల పరిరక్షణలో భాగంగా సిసి కెమెరాలను పట్టణ సీఐ శంకరయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సిసి కెమెరాలను నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు జాకీర్ అహ్మద్, కుప్పం పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము లు వితరణగా అందించామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ రాజకీయ విగ్రహాల పరిరక్షణకు సిసి కెమెరాలు ఏర్పాటుకు సహకారం అందించాల్సిందిగా పట్టణ సిఐ తమ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. ఆయన సూచనల మేరకు పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

సమస్యల పరిష్కారానికే విద్యుత్ అదాలత్

విద్యుత్ అదాలత్‌లో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అధికారులు

ప్రజాశక్తి -కార్వేటినగరం: విద్యుత్ వినియోగదారులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారానికే ప్రత్యేక విద్యుత్ అదాలత్ ఏర్పాటు చేశారని రిటైర్డ్ జడ్జి, విద్యుత్ అదాలత్ ఛైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయ సమావేశ భవనంలో విద్యుత్ వినియోగదారుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక విద్యుత్ అదాలత్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ జీడీనెల్లూరు, కార్వేటినగరం, నగరి డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ అదాలత్ కు ఎనిమిది ఫిర్యాదులు మాత్రమే రావడం సంతోషించ దగ్గ విషయమని, విద్యుత్ అధికారుల విధి నిర్వహణలకు ఇది నిదర్శమన్నారు. విద్యుత్ సమస్యలు లేని డివిజన్లుగా ఉండటం విద్యుత్ అధికారుల పనితీరును అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రత్యేక ఆదాలత్‌లలో వచ్చిన వినతులను పరిశీలించి పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆనంత రం సభ్యులు రామమోహన్‌రావు మాట్లాడుతూ విద్యుత్ వినియోగ దారులు తమ సమస్యలు వినతుల ద్వారా అధికారులకు తెలిపి ఎప్పటికప్పుడు పరిష్కరించు కోవా లన్నారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక సభ్యులు ఎస్ఎల్ అంజనీకుమార్ స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి, చిత్తూరు జిల్లా పర్యవేక్షకులు ఇస్మాయిల్ అహ్మద్, డీఈ సురేష్ కుమార్, ఏడీఈ చంద్రబాబు (కార్వేటినగరం), రమణముని (నగరి), శేషాద్రిరెడ్డి (జీడీనెల్లూరు) ఏఈలు, విద్యుత్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

వాటర్ క్యాన్లు అందిస్తున్న రీడ్స్ సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి -తవణంపల్లి: ఐరాల రీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో డౌన్ సిండ్రోమ్ డే వారోత్సవాల సందర్భంగా తవణంపల్లి మండలం భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గలిగిన పిల్లలకు రీడ్ సంస్థ గేమ్స్ నిర్వహించి విజేతలకు క్యారం బోర్డు, పుస్తకాలు, పెన్సిళ్లు వంటి బహుమతులు అందించారు. తల్లిదండ్రులకు వాటర్ క్యాన్‌లు అందించారు. పూతలపట్టు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు అన్ని పరికరాలు అందించారు. తవణంపల్లి మండలం భవిత కేంద్రంలోని పిల్లలకు మంగళవారం క్యారం బోర్డు, పెన్సిళ్లు, పుస్తకా లు అందించారు. ఈ కార్యక్రమంలో రీడ్స్ సంస్థ అధినేత తియో స్టీఫెన్ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు క్రీడలపై ఆసక్తిని కల్పించేందుకు యత్నిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థికీ క్రీడలు అవసరమని వారి మానసిక ఆరోగ్య విషయాల్లో దృఢంగా ఉండేందుకు క్రీడలు అవసరం అని పేర్కొన్నారు.ఆ సంస్థ జిల్లా సీనియర్ కోఆర్డినేటర్ కోదండపాణి, గీతాంజలి అంబికా , ఎంఈఓ 2 త్యాగరాజు రెడ్డి, ఉపాధ్యాయులు సురేంద్ర బాబు రెడ్డి, కృష్ణారెడ్డి, విజయ్ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, సాక్షి జగన్నాథం, భాస్కర్, భవిత కేంద్రం ఉపాధ్యాయులు టి దేవేంద్ర , దిలీప్‌లు, ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

ప్రజాశక్తి -విజయపురం (నగరి): నగరి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో నగరి మున్సిపాల్టీ, నగరి రూరల్ మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు సుజాత ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక చింతలపట్టెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నగరి ప్రాజెక్ట్ సిడిపిఓ కె కృష్ణవేణి ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు కలిగిన చిన్నారుల అభివృద్ధిని నిర్ధారించడానికి నూతన విద్యా విధానం ద్వారా చిన్నారులకు ఆటలు పాటలతో పాటు విద్య, వివిధ అంశాలపై, సూక్ష్మ పోషక లోపాలు, పోషణ, పెండింగ్ పద్ధతుల గురించి, మానసిక ఆరోగ్య స్థితి గతుల పెంపునకు శిక్షణ ఇస్తున్నామని తలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపరువైజర్లు శంకరమ్మ ,లక్ష్మి ,శ్యామల, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నగరిలో

బంగారుపాళెంలో

బంగారుపాళ్యం: ఆటపాట విద్య ఆకర్షణీయ విద్య అని సిడిపిఓ వాణి శ్రీదేవి అన్నారు. మండలంలోని తుంబకుప్పం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణను సూపరువైజర్లు రెడ్డి కళ్యాణి, జయశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పలు పథకాలు తీసుకొచ్చాయన్నారు. పడాయి బి, పోషణ బి ప్రతి గ్రామంలో అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తుంబకుప్పం సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైద్యాధికారి గౌరి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : గంగాధర నెల్లూరు రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళ వారం ఆరిమాకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ గౌరి చలివేంద్రం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఆర్ పురం ఎంపీడీవో మోహన్ మురళి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు, ప్రజల అవసరార్థం చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షణీయమని కొనియాడారు. డాక్టర్ గౌరీ మాట్లాడుతూ ఈ వేసవిలో ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు, ప్రజలు దాహార్తి తీర్చేందుకు అవసరమైన చలివేంద్రాన్ని అడిగిన వెంటనే ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ సొసైటీ జీడి నెల్లూరు సభ్యులు పాపిరెడ్డి బృందానికి ధన్యవాదాలు తెలి పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది , రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: గంగాధరనెల్లూరు పిహెచ్‌సిలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రం ప్రారంభించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో రోగులు, ప్రజల దాహార్తి తీర్చడానికి డాక్టర్ ప్రవీణ్, జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శి సహదేవ నాయుడు, రెడ్ క్రాస్ మండల ఛైర్మన్ పాపిరెడ్డి వైద్య సిబ్బందితో కలిసి ఈ చలివేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ శ్రీనివాసులు, ఏవో గోపి, జీడి నెల్లూరు రెడ్ క్రాస్ జిల్లా కార్యదర్శి దినకరన్, జయరాం ఏఎన్ఎం లు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పా ల్గొన్నా రు.

గంగాధర నెల్లూరులో

పెద్దవంక కాలువను మూసివేయొద్దు

- తాగు, సాగునీటికి ఇబ్బంది..
- ఎమ్మెల్యేకు స్థానికుల వినతి

ప్రజాశక్తి -పలమనేరు: ఎన్నో ఏళ్లుగా తాగు, సాగు నీటిని అందిస్తూ ఆదుకుంటున్న పెద్దవంక కాలువను ఎక్స్‌ప్రె స్ హైవే కారణంగా మూసి వేయనున్నారని దీన్ని పరిరక్షిం చాలని వి కోట మండలం జవ్విని పల్లి పంచాయతీ, నక్కపల్లె పంచాయతీ వాసులు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని మంగళవారం కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జవ్వినిపల్లి, నక్కపల్లె పంచాయతీ వాసులు మాట్లాడుతూ తమ గ్రామ రహదారిలోని రామాపురం -పెద్దవంక ఎక్స్ ప్రెస్ హైవే కారణంగా పెద్దవంక కాలువ కనుమరుగు అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్లనాటి చరిత్ర కలిగిన ఆ కాలువను మూసి వేయొద్దని సాగు, తాగు నీటికి ఇబ్బందులు తప్పవ న్నారు. హైవే పనులు మరో మార్గానికి మళ్లించాలని ఎమ్మెల్యే ను కోరారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఎక్స్‌ప్రెస్ హైవే అధికారులతో ఫోను ద్వారా మాట్లాడి రైతులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రంగనాథ్, మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి, నారాయణ స్వామి, మోహన్ రెడ్డి, నాసిర్, కేవిఆర్, మోహన్ గౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న నక్కపల్లె వాసులు

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి -వెదురుకుప్పం: ద్విచక్ర వాహనాన్ని వ్యాను ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన వెదురుకుప్పం మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. వెదురు కుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్య కథనం మేరకు.... కార్వేటినగరం మండలంలోని కెపి అగ్రహారానికి చెందిన బిసుబ్రహ్మణ్యం కుమారుడు రవి(26) తిరుపతి లోని పెట్రోల్ బంకు లో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో పనులు ముగించుకుని తిరుపతి నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం పరిధిలో ని చిన్నపోడుచేను వద్ద ఎదురుగా వస్తున్న వ్యాను వాహనం ఢీకొంది. దీంతో రవి కి తలకు బలమైన గాయం కావడంతో పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.బైక్ లో తనతో పాటు వస్తున్న అనిల్ కి ఎటువంటి గాయాలు కాలేదు. రవి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. పోస్ట్ మార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాసుపత్రికి మృతదేహాన్ని తరలించినట్లు చెప్పారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి -పలమనేరు : రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పలమనేరు మ్మెల్యే అమర్నాథరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం ఘనంగా ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి పలమనేరు నియోజకవర్గంలోని మైనారిటీ సోదరులు పెద్ద ఎత్తున విచ్చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక నమాజ్ లో ముస్లిం సోదరులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొని అల్లాను ప్రార్థించారు. ఆ అల్లా చల్లని చూపుతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అదేవిధంగా మైనారిటీల సంక్షేమానికి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని, గతంలో మంజూరు చేసి ఆగిన పనులన్నింటినీ పూర్తి చేయిస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులతో పాటు టీడీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నేడు భువనేశ్వరి రాక

ఏర్పాట్ల పరిశీలన

ఏర్పాట్లు పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-గుడిపల్లి: గుడిపల్లి మండలం గుడి చెంబగిరి గ్రామానికి రాష్ట్ర ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరి బుధవారం రానున్నారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షుడు బాబు నాయుడు ఆధ్వర్యంలో పర్యటన ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. అక్కడ ఎలాంటి సమస్యలు లేకుండా... ప్రతి ఒక్కరూ పని చేయాలని, మొదట అగస్త్య ఫౌండేషన్ విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహిస్తారన్నారు. ఉదయం సుమారు 3 గంటల ప్రాంతంలో గుడి చెంబగిరి గ్రామానికి చేరుకుంటారని అక్కడ మహిళలతో సమావేశం నిర్వహించి మహిళలు స్వయం శక్తితో ఏ విధంగా ముందుకు వెళ్లాలో ప్రసంగిస్తారన్నారు. మండల కూటమి నాయకులు ప్రతి ఒక్కరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి హేమాంబర గౌడు, ఆ పంచాయతీ సర్పంచ్ వెంకటేష్, కుప్పం నియోజకవర్గం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుబ్రమణి, అగరం సర్పంచ్ గోపాల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్లింలకు అందాల్సిన పథకాలన్నీ అందిస్తాం:జెసి

ఇఫ్తార్ విందులో పాల్గొన్న జెసి, ఎమ్మెల్యే, మేయర్..

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ప్రభుత్వం తరపు నుంచి ముస్లింలకు అందాల్సిన పథకాలన్నీ వారికి జిల్లా జెసి జి విద్యాధరి పేర్కొన్నారు. రంజాన్‌ను పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా జిల్లా యంత్రాంగం తరపున ఇఫ్తార్ విందును మైనార్టీ సోదరులకు మంగళవారం చిత్తూరు, మిట్టూరులోని ఉర్దూ షాదీ మందిర్ లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెసి జి విద్యాధరి, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, నగర మేయర్ అముద, చుడా ఛైర్ పర్సన్ కటారి హేమలత మాజీ ఎం ఎల్ సి, ఎమ్మెల్యే దొరబాబు, ఏఎస్‌మనోహర్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి చిన్నా రెడ్డి, ఈడి మైనారిటీ ఆర్థిక సంస్థ హరినాథ్ రెడ్డి, ముస్లిం మత పెద్దలు, సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగాజసి మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా ముందస్తుగా ముస్లిం సోదర సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు అన్నారు. మత గురువులు, ముస్లిం సోదర సోదరీమణుల సమక్షంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించామన్నారు. ముస్లింలు సమస్యలు కలెక్టరేట్ లో ఫిర్యాదు చేస్తే వారి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ముస్లిం సోదరులకు అందాల్సిన పథకాలన్నీ అందించేలా, గత 30 రోజులుగా రాష్ట్రంలోని ప్రజలు అందరూ బాగుండాలని ప్రార్థించానని, అల్లా దయవల్ల చిత్తూరు నియోజక వర్గ ప్రజలు బాగుండాలని కోరుకుంటున్నానని, ముస్లిం ప్రజలందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు అండగా ఉంటుందని తెలిపారు.

కమిటీల నిర్మాణం అత్యవసరం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- ఐరాల:



గ్రామ స్థాయిలో టిడిపి బలోపేతానికి కమిటీల నిర్మాణం అత్యవసరమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం ఐరాల మండల నాయ కులతో చిత్తూరు టిడిపి కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో క్లస్టర్ ఇంఛార్జ్‌లు, బూత్ కమిటీ సభ్యులు, మండల కమిటీ, వార్డు కమిటీ, యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు తదితర నేతలతో పార్టీ భవిష్యత్తుపై విస్తృతంగా చర్చించి నేతలకు దిశానిర్దేశం చేశారు. టిడిపి సభ్యత్వ కార్డులను నాయకులకు అందించారు. పార్టీ బలోపేతానికి కుటుంబ సాధికార సారధుల నియామకం ఎంత ముఖ్యమో వివరించారు. ఏప్రిల్ 15వ తేదీ లోపు కుటుం బ సాధికార సారధుల నియామకం పూర్తి చేయాలని అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐరాల టిడిపి అధ్యక్షులు గిరిధర్ బాబు, జెడ్పీటీసీ సుచిత్ర కన్నయ్య నాయుడు, మాజీ జెడ్పీటీసీ లతాబాబు నాయుడు, ఐరాల మండల కార్య నిర్వహక కార్యదర్శి మోతుకూరి సోమ శేఖర్ నాయుడు, కాణిపాకం దేవస్థానం మాజీ ఛైర్మన్ మణినాయుడు, నాంపల్లె సర్పంచ్ స్వర్ణ మరియు మండల నాయకులు, క్లస్టర్ ఇంఛార్జ్, బూత్ కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు, యూనిట్ ఇన్‌చార్జి, సర్పంచులు ఎంపీటీసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవోదయకు వెదురుకుప్పం, సోమల విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి -వెదురుకుప్పం : మండలంలోని వావిలిచెను గ్రామానికి చెందిన బాలాజీ రెడ్డి కుమారుడు, జస్విన్ పెనుమూర్ లోని శ్రీ విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో 5వ తరగతి చదువుతున్న జస్విన్ నవోదయకి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ చిరంజీవి రెడ్డి, గుణశేఖర్ రెడ్డి , హెడ్ మాస్టర్ మునస్వామి అభినందనలు తెలిపారు.

సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలోని శ్రీ భారతి విద్యా మందిర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థి రెడ్డి భావన 2024-25 సంవత్సరానికి జవహర్ నవోదయ పరీక్షలలో ఎంపికైనట్టు కరస్పాండెంట్ మహమ్మద్ అంజాద్ తెలిపారు. విద్యార్థి ఎంపిక కావడం పట్ల పాఠశాల సిబ్బంది కరస్పాండెంట్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.